# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

బుధవారం / 31.01.2024


## ఫిబ్రవరి 2 వ వారంలో

# అసెంబ్లీ సమావేశాలు?


* శాసనసభలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్న రాష్ట్ర ప్రభుత్వం?
* సుమారు 6 రోజులపాటు సాగనున్న బడ్జెట్ సమావేశాలు?



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి అందనున్న నిధుల మొత్తాన్ని బేరీజు వేసుకొని పూర్తిస్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టే దిశలో ప్రభుత్వ యోచన?

## సీఎం రేవంత్ ఆధ్వర్యంలో కొలువుల జాతర..

**తెలంగాణవీణ, హైదరాబాద్ :** కొత్త ప్రభుత్వఆధ్వర్యంలో తొలిసారిగా కొలువుల జాతర జరగనుంది.ప్రభుత్వ కొలువు లక్షల మంది కల. అలాంటి కలను సాకారం చేసుకున్న సుమారు 7వేల మందికి ఈ రోజు సర్కారు నియామక పత్రాలను అందించనుంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 7142 నర్సింగ్ పోస్ట్ లకు గాను 7094 అర్హుల జాబితాను ఇటీవల సర్కారు ప్రకటించింది. వీరిలో ప్రధానంగా వైద్య సంచాలకులు, ప్రజారోగ్య సంచాలక విభాగాల్లో 5571 , తెలంగాణ వైద్య విధాన పరిషత్ కి 736, మహాత్మా జ్యోతిభా ఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్సిల్ ఎడ్యుకేషన్ సొసైటీకి 253 మంది ఎంపికైనట్టు తెలిపింది. స్టాఫ్ నర్స్ పోస్టులకు ఎంపికైన వారిలో 88.16% మహిళలు కాగా 11.84% మంది పురుషులని స్పష్టం చేసింది. వారందరికీ ఈరోజు మధ్యాహ్నం సుమారు 3 గంటల నుంచి ఎల్బి స్టేడియం వేదికగా సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందించనున్నారు. ఇందుకోసం ఎల్బి స్టేడియంలో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్టాఫ్ నర్స్ పరీక్షల్లో అర్హత సాధించి... పోస్ట్ లకు ఎంపికైన వారికి కార్యక్రమానికి హాజరుకావల్సిందిగా సర్కారు సమాచారం అందించింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి జరగనున్న కార్యక్రమంలో సీఎంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నరసింహ సహా పలువురు మంత్రులు హాజరుకానునట్టు సమాచారం.




## ట్రాఫిక్ పై ప్రారంభమైన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ ట్రాఫిక్ పై సచివాలయంలో ప్రారంభమైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష.
హాజరైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు.
గ్రేటర్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ, అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చ.

## కేటీఆర్ పైన పరువు నష్టం దావా వేస్తా

### - మాణికం ఠాకూర్

### నోటీసులు ఎవరికి పంపాలో తెలియడం లేదా? - కేటీఆర్



* కాంగ్రెస్ తెలంగాణ మాజీ ఇంచార్జ్ మాణికం ఠాకూర్ పై x లో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు
* బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పైన పరువు నష్టం దావా వేస్తానన్న మాణికం ఠాకూర్....
* మాణికంఠాకూర్ అయోమయంలో ఉన్నారు.
* మాణికం ఠాకూర్ తోటి కాంగ్రెస్ నాయకులు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బహిరంగంగానే రేవంత్ రెడ్డి మీకు 50 కోట్ల రూపాయలు ఇచ్చి పిసిసి పదవి కొనుక్కున్నారని చెప్పిన మాట గుర్తు చేసిన కేటీఆర్
* పెద్ద ఎత్తున మీడియాలో వచ్చిన 50 కోట్ల లంచం వార్తలనే తాను ప్రస్తావించానన్న కేటీఆర్
* కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీ పై చేసిన ఆరోపణలను ఇప్పటిదాకా వెనక్కి తీసుకోలేదన్న కేటీఆర్
* కోమటిరెడ్డి తాను చేసిన 50 కోట్ల లంచం వ్యాఖ్యల పైన వివరణ కూడా ఇవ్వలేదు
* మీరు పంపే పరువు నష్టం నోటీసులు కోమటిరెడ్డి వెంకటరెడ్డికి పంపిస్తే బాగుంటుంది
* నా చిరునామాకు కాకుండా మీ ప్రభుత్వంలో సచివాలయంలో కూర్చున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి కార్యాలయానికి పంపించండని సూచించిన కేటీఆర్

## ఏసీబీ కస్టడీకి శివ బాలకృష్ణ..



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణను ఏసీబీ కస్టడీకి కోర్టు అనుమతించింది. ఎనిమిది రోజుల పాటు శివ బాలకృష్ణ ఏసీబీ కస్టడీలో ఉండనున్నారు. ఈ విచారణలో మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయిన శివ బాలకృష్ణ ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. రెరా కార్యదర్శి శివ బాలకృష్ణపై సస్పెన్షన్ వేటు పడిన సంగతి తెలిసిందే. శివబాలకృష్ణను సస్పెన్షన్‌పై హెచ్ఎండీఏ మెట్రో పాలిటన్ కమిషనర్ దాన కిశోర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మెట్రరైల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేశారు శివ బాలకృష్ణ. రెరా ఇంచార్జి కార్యదర్శిగా కూడా పని చేశారు.శివబాలకృష్ణ ఇల్లు, బంధువులు, స్నేహితుల ఇండ్లలో 16 చోట్ల సోదాల అనంతరం మొత్తం రూ.99,60,850 నగదు, 1,988 గ్రాముల బంగారు, వజ్రాభరణాలు, సుమారు 6 కిలోల వెండి నగలు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపిన సంగతి తెలిసిందే. దాదాపు రూ.5,96,27,495 విలువైన చర, స్థిర ఆస్తులను కనుగొన్నట్టు వెల్లడించారు. సోదాల్లో దొరికిన మొత్తం స్థిర, చర ఆస్తులు ప్రభుత్వ విలువ ప్రకారం రూ.8,26,48,999 అని, బయటి మార్కెట్‌లో వాటి విలువ రూ.వందల కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఇంకా అదనపు ఆస్తులకు సంబంధించిన వెరిఫికేషన్ జరుగుతున్నదని వివరించారు. ఏసీబీ యాక్ట్‌లోని యూ/ఎస్ 13(1)(బీ), 13(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## రంగంలోకి కేసీఆర్..

### రేపే ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రీఎంట్రీ ఇవ్వనున్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీలు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఫలితాల అనంతరం ప్రగతి భవన్ ఖాళీ చేసి తన ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో ఉన్న కేసీఆర్.. కాలు జారీ కింద పడడంతో తుంటి ఎముక విరిగి యశోద ఆసుపత్రిలో సర్జరీ కావడంతో గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కేసీఆర్ ఇప్పటి వరకు ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయలేదు. తుంటి ఎముకకు సర్జరీ తరువాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు మాజీ సీఎం కేసీఆర్. తాజాగా ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారు అయింది. రేపు మధ్యాహ్నం 12 గంటలకు అసెంబ్లీకి చేరుకోనున్న కేసిఆర్. మధ్యాహ్నం 12:45 నిమిషాలకు స్పీకర్ ఛాంబర్ లో ఎమ్మెల్యేగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం. ఎల్ఓపి నేతగా బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం నేరుగా అసెంబ్లీలోని ఎల్ఓపి కార్యాలయం చేరుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

## రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి అరువు తెచ్చుకున్న నాయకుడు

### - కర్నె ప్రభాకర్



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తెలంగాణ భవన్ లో ప్రెస్ మీట్ పెట్టారు. నిన్న రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పై చేసిన వ్యాఖ్యలని ఖండించారు. 'తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పును బిఆర్ఎస్ గౌరవించింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చేదాకా మా బాధ్యతను గుర్తు చేస్తామని కేటీఆర్ చెప్పారు. తెలంగాణలో అసలు అభివృద్ధి జరగనట్లుగా ప్రజలను మోసం చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై కాంగ్రెస్ దృష్టి సారించాలి. కాంగ్రెస్ నేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ లపై కాంగ్రెస్ నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నిన్న చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారన్న సోయి లేకుండా మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి అరువు తెచ్చుకున్న నాయకుడు. కాంగ్రెస్ కేవలం రెండు రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో వుంది. అబద్దాల హామీలతో కర్ణాటక,తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దేశంలో అధికారంలోని రాష్ట్రాల్లో కాంగ్రెస్ చచ్చిపోయిందా. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ గవర్నమెంట్ ఫెయిల్యూర్ గవర్నమెంట్ గా పేరు తెచ్చుకున్నారు. డిసెంబర్ 9 న రైతురుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పలేదా. వరి పంటకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పాతర పెట్టింది. గ్యాస్ సిలిండర్ 500 రూపాయలకే ఇస్తామన్నారు. ప్రజలు ఓట్లు వేస్తే...హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చింది. బిల్లా,రంగాలు అంటూ రేవంత్ రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారు' అని అన్నారు కర్నె ప్రభాకర్.

## రాహుల్ గాంధీ కారుపై రాళ్లదాడి

**తెలంగాణవీణ, జాతీయం :** బంగాల్ లో భారత్ జోడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న కారుపై గుర్తు తెలియని వ్యక్తులు రాళ్ల దాడి చేశారు. ఈ దాడిలో రాహుల్ ప్రయాణిస్తున్న కారు వెనుక అద్దం ధ్వంసమైంది. కాగా రాహుల్‌కు ఎటువంటి గాయాలు కాలేదు.మాల్దా జిల్లాలోని హరిశ్చంద్రపుర్‌లో రాహుల్ ప్రయాణిస్తున్న కారుపై దాడి జరిగిందని బంగాల్ కాంగ్రెస్ చీఫ్ అధీర్ రంజన్ చౌదరి తెలిపారు. ఇలాంటి దాడులు ఆమోదయోగ్యం కాదని అన్నారు.



## స్ట్రీట్ ఫుడ్ కుమారి ఆంటీ షాపుపై తెలంగాణ ప్రభుత్వం స్పందన..



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** చిరు వ్యాపారి కుమారి ఫుడ్ స్టాల్ స్థలాన్ని మార్చాలన్న అధికారుల నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫుడ్ స్టాల్ స్థల మార్పు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ, ఎంఏయూడీ అధికారులకు రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. కుమారి మొన్నటివరకు వ్యాపారం చేసుకున్న స్థానంలోనే తన వ్యాపారాన్ని తిరిగి కొనసాగించుకోవచ్చని తెలిపారు. ప్రజా పాలనలో సామాన్యులకి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. త్వరలోనే ఆమె స్టాల్‌ను సందర్శిస్తామని సైతం రేవంత్ తెలిపారు. చిరు వ్యాపారి కుమారి ఫుడ్ స్టాల్ స్థలాన్ని మార్చాలన్న అధికారుల నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫుడ్ స్టాల్ స్థల మార్పు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ, ఎంఏయూడీ అధికారులకు రేవంత్ ఆదేశాలు జారీ చేశారు. కుమారి మొన్నటివరకు వ్యాపారం చేసుకున్న స్థానంలోనే తన వ్యాపారాన్ని తిరిగి కొనసాగించుకోవచ్చని తెలిపారు. ప్రజా పాలనలో సామాన్యులకి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. త్వరలోనే ఆమె స్టాల్‌ను సందర్శిస్తామని సైతం రేవంత్ తెలిపారు.

## నేటితో ముగియనున్న... పెండింగ్ చలాన్ల రాయితీ...!



**తెలంగాణవీణ, హైదరాబాద్ :** వాహనదారులకు అలర్ట్.. రాయితీ పెండింగ్ చలాన్ల చెల్లింపులకు పోలీసు శాఖ ఇచ్చిన గడువు నేటితోముగియనుంది..మరోసారి గడువు పొడిగించేది లేదని ఇప్పటికే పోలీసు శాఖ స్పష్టం చేసింది. గతేడాది డిసెంబర్ 27నుంచి పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు 15 రోజులు అవకాశం కల్పించిన ప్రభుత్వం.. సాంకేతిక సమస్యల కారణంగా దాన్ని ఈనెల 31 వరకు పొడిగించిన విషయం తెలిసిందే. ద్విచక్రవాహనాలు, ఆటోలకు 80%, ఆర్టీసీ బస్సులకు 90%, ఇతర వాహనాలకు 60% రాయితీ ప్రకటించటంతో మంచి స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది.

తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
బుధవారం / 31. 01. 2024
https://epaper.telanganaveena.com/
AP DYNAMIC 5:00PM

## కృష్ణపట్నం పోర్టు ఏపీ సంపద

కృష్ణపట్నం నుంచి అదానీ పోర్టును తరలించవద్దంటూ ఇవాళ నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మద్దతు ప్రకటించారు. కృష్ణపట్నం నుంచి కంటైనర్ పోర్టు తరలిపోతే ఏపీకి ఆర్థికంగా నష్టం తప్పదని సోమిరెడ్డి అన్నారు. కృష్ణపట్నం పోర్టు ఆంధ్రప్రదేశ్ విలువైన సంపద అని పేర్కొన్నారు. పోర్టు తరలిపోతే నెల్లూరు జిల్లాకు బొగ్గు, బూడిదే మిగులుతుందని వ్యాఖ్యానించారు. త్వరలో అఖిలపక్షం నేతలతో కలిసి కృష్ణపట్నం పోర్టును సందర్శిస్తామని సోమిరెడ్డి వెల్లడించారు. పోర్టు తరలిపోకుండా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# ఏపీ కేబినెట్ భేటీ కీలక నిర్ణయాలు

- ఆంధ్రప్రదేశ్ కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు
- డీఎస్సీకి గ్రీన్ సిగ్నల్.. 6వేలకుపైగా పోస్టుల భర్తీ
- వైఎస్సార్ చేయూత నిధుల విడుదలకు ఆమోదం

**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన అమరావతి సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చించారు. అలాగే మంత్రివర్గ సమావేశంలో డీఎస్సీ నిర్వహణ, నోటిఫికేషన్పై చర్చించారు.. సుమారు 6 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఆమోదం తెలిపారు. అటవీశాఖలో 689 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదించింది.. ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్లు సహా వివిధ పోస్టుల భర్తీ చేస్తారు.వైఎస్సార్ చేయూత నాలుగో విడతకు కేబినెట్ ఓకే చెప్పింది. ఫిబ్రవరి నెలలో వైఎస్సార్ చేయూత నిధులు విడుదల చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు 5 వేల కోట్ల మేర నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎస్ఐపీబీ ఆమోదించిన తీర్మానాలకు ఓకే చెప్పారు. మరోవైపు ఇంధన రంగంలో రూ.22 వేల కోట్లకుపైగా పెట్టుబడుల ప్రతిపాదనలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇంధన రంగంలో రూ.22,302 కోట్ల పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 5,300 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయంటున్నారు.3350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టల ఏర్పాటుకు జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ కు ఆమోదం తెలిపారు. దాదాపు రూ.12,065 కోట్ల పెట్టుబడితో జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ ఏర్పాటు చేయనున్నారు. ఆగ్నాగ్రీన్ ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్‌ను ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 4 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది.. ఇక, ఎక్రోన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1350 కోట్లు పెట్టుబడి ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది.



# ఏపీలో పోలీసు వ్యవస్థ పతనం.. డీజీపీ తక్షణమే వీఆర్ఎస్ తీసుకోవాలి



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** రాష్ట్రంలో పోలీసు శాఖ పతనమవుతున్నా కట్టడి చేయలేని డీజీపీ తక్షణమే స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు డిమాండ్ చేశారు. ఏపీలో పాలనా వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమై, ఊరూరా జగన్ గూండారాజ్యం మాత్రమే నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్టూరులో మారణాయుధాలతో మైనింగ్ తనిఖీలు, క్రోసూరులో రౌడీ మూకల విధ్వంసానికి పోలీసుల సహకారం గాడితప్పిన పాలనకు నిదర్శనమని అన్నారు. మార్టూరులో మారణాయుధాలతో గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీల పేరిట చేసిన అరాచకం వ్యవస్థల విధ్వంసం కాదా? అని దుయ్యబట్టారు. మైనింగ్ శాఖలో ఒక ఏడీ స్థాయి అధికారి రౌడీలతో తనిఖీలకు వచ్చిన ఘటన రాష్ట్రంలో గూండారాజ్‌కు ఉదాహరణగా నిలుస్తోందని మండిపడ్డారు. క్రోసూరులో ఎమ్మెల్యే కుమారుడు వందల మందితో ప్రజల ఆస్తులపై దాడికి దిగితే చర్యలు తీసుకోకపోగా, పోలీసులు సహకరించారని చంద్రబాబు విమర్శించారు. రాష్ట్ర పోలీసు శాఖ గౌరవాన్ని దిగజార్చిన ఘటనలపై స్పందించని డీజీపీ ఎందుకని ప్రశ్నించారు. ఒకప్పుడు దేశం కీర్తించిన రాష్ట్ర పోలీసు శాఖ కళ్ల ముందే పతనం అవుతుంటే కట్టడి చేయలేని డీజీపీ తక్షణమే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాలని అన్నారు. కింది స్థాయి అధికారులు తప్పు చేస్తే సరిదిద్దాల్సిన జిల్లా ఎస్పీలు అరాచకాలకు కొమ్ముకాస్తున్నారని దుయ్యబట్టారు. చట్టాన్ని అమలు చేయలేని ఆయా జిల్లాల ఎస్పీలు ఖాకీ యూనిఫాం తీసేసి వైసీపీ జెండానే యూనిఫాంగా కుట్టించుకోవాలన్నారు. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటున్న అధికారులు చట్టానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. తప్పు చేసిన అధికారులను న్యాయస్థానాలు తప్పక శిక్షిస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు.

# 'వోట్ ఆన్ బడ్జెట్' ను అడ్డుకోండి



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా సాధించుకునేందుకు ఓ గొప్ప అవకాశం వచ్చిందని జేడీ లక్ష్మీనారాయణ బుధవారం పేర్కొన్నారు. పార్లమెంట్ లో బడ్జెట్ సమావేశాల రూపంలో వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుందామని రాజకీయ నేతలకు ఆయన పిలుపునిచ్చారు. విభజన హామీలను నెరవేర్చాలని, ఏపీకి వెంటనే ప్రత్యేక హోదా ప్రకటించాలనే డిమాండ్ తో పార్లమెంట్ లో డిమాండ్ చేయాలని ఎంపీలను కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే 'వోట్ ఆన్ బడ్జెట్'ను అడ్డుకోవడం ద్వారా ప్రత్యేక హోదా సాధించుకోవచ్చని చెప్పారు. వోట్ ఆన్ బడ్జెట్ పాస్ కాకుండా అడ్డుకుని పార్లమెంట్ సాక్షిగా ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబులను జేడీ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. 'ప్రత్యేక హోదా సాధన సమితి' ఆధ్వర్యంలో బుధవారం విశాఖపట్నం టూటౌన్ ఏరియాలోని గాంధీ విగ్రహం వద్ద జైభారత్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మద్దతుగా నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. విభజన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

# ఇక యుద్ధానికి సై ?



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ లో రాబోయే ఎన్నికల సమరానికి సై అంటున్నాయి టీడీపీ–జనసేన పార్టీలు. సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతూ ఉండటంతో రెండు పార్టీలు అభ్యర్థులను ఫైనల్ చేసే పనిలో పడ్డాయి.ఈసారి ఎలాగైనా అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో ఉన్న చంద్రబాబు నాయుడు–పవన్ కల్యాణ్.. కసిగా ఉన్నారు. ఈ క్రమంలోనే ఫిబ్రవరి నెల మొదటి వారంలో టీడీపీ–జనసేన మొదటి జాబితా విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ రకంగా స్పీడ్ పెంచారు టీడీపీ–జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్. రా.. కదలిరా సభలకు మూడు నాలుగు రోజులు విరామం ఇచ్చిన చంద్రబాబు నాయుడు హైదరాబాద్ చేరుకున్నారు. ఈ టైమ్‌లో అభ్యర్థుల జాబితా సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒకటి రెండ్రోజుల్లో చంద్రబాబు నాయుడు ఇంకా పవన్ కల్యాణ్ మరోసారి భేటీ కానున్నారు. ఆ తర్వాత జనసేన పార్టీకి ఎన్ని సీట్లు కేటాయించే విషయంపై క్లారిటీ రానుంది. ఇప్పటికే అభ్యర్థుల ఎంపికపై రెండు దఫాలుగా భేటీ అయిన ఇద్దరు నేతలు మూడోసారి మీటింగ్ తర్వాత చివరి నిర్ణయానికి రానున్నారు.ఫిబ్రవరి 4వ తేదీ నుంచి చంద్రబాబు నాయుడు రా.. కదలిరా సభలు తిరిగి ప్రారంభం కానున్నాయి. మొత్తం మూడు రోజులపాటు ఐదు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఈ సభలు నిర్వహించనున్నారు చంద్రబాబు నాయుడు.అటు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కూడా నాలుగో తేదీ నుంచే ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రణాళిక రెడీ చేసుకున్నారు. ఈలోపే మొదటి లిస్టు విడుదల చేయాలని రెండు పార్టీల వారు భావిస్తున్నారు.ఇక వీలైనంత త్వరగా అభ్యర్థులను ప్రకటించి ప్రజల్లోకి వెళ్లడంతో పాటు.. ఉమ్మడి మ్యానిఫెస్టోపై కసరత్తు స్పీడ్ చేశారు రెండు పార్టీల అగ్రనేతలు. పూర్తిస్థాయి కసరత్తు తర్వాత ఇద్దరూ కలిసి ఉమ్మడి మ్యానిఫెస్టోను రిలీజ్ చేసేందుకు ప్రణాళికని సిద్ధం చేస్తున్నారు. టీడీపీ–జనసేన మొదటి జాబితా విడుదల చేసిన తర్వాత చంద్రబాబు నాయుడు పవన్ కల్యాణ్ ఇద్దరూ కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.ఇక అభ్యర్థుల జాబితాతో పాటు మ్యానిఫెస్టో విషయంలో స్పీడ్ పెరగడంతో రెండు పార్టీల నేతల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది.

# రేపట్నుంచి టెట్‌కు దరఖాస్తుల స్వీకరణ

**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** రాష్ట్రంలోని ఉపాధ్యాయ నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. సుమారు 6 వేల పోస్టులను డీఎస్సీ 2024 ద్వారా భర్తీ చేసేందుకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అలాగే ఈసారి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), డీఎస్సీని విడివిడిగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత టెట్ నిర్వహించి, ఆ తర్వాత డీఎస్సీ నిర్వహించనున్నారు. ఈ క్రమంలో టెట్‌కు ఫిబ్రవరి ఒకటి నుంచి ఇన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుల సంఖ్య ఆధారంగా పరీక్షల షెడ్యూల్ నిర్ణయిస్తామని సర్కార్ పేర్కొంది. దరఖాస్తులు భారీగా వస్తే పరీక్షల నిర్వహణరే 15 రోజులు పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాత 10-15 రోజులు అటు ఇటుగా డీఎస్సీకి కూడా దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు డీఎస్సీలో 6 వేల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి పాఠశాల విద్యాశాఖ ప్రతిపాదనలు పంపగా.. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి టెట్, డీఎస్సీకి ఈ రోజు జరిగే మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపనున్నారు. అనంతరం షెడ్యూల్ ప్రకటిస్తారు. తొలుత టెట్ నిర్వహించి, ఫలితాలు ఇచ్చిన తర్వాత డీఎస్సీ పరీక్ష నిర్వహించే అవకాశం ఉంది. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుందనే సంగతి తెలిసిందే. టెట్, డీఎస్సీ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు.

AP – TET

## కుమారి ఆంటీ హోటల్ మళ్లీ తెరుచుకుంది!

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** హైదరాబాద్ లో కుమారి ఆంటీ హోటల్ కారణంగా ట్రాఫిక్ కు ఇబ్బందులు కలుగుతున్నాయని పోలీసులు అడ్డుకోవడం, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని కుమారి ఆంటీ హోటల్ పై కేసులు ఎత్తివేయాలని ఆదేశించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ట్రాఫిక్ పోలీసులు అనుమతించడంతో నేడు కుమారి ఆంటీ హోటల్ తెరుచుకుంది. కుమారి ఆంటీ హోటల్ మాదాపూర్ లోని ఐటీసీ కోహినూర్ హోటల్ ఎదురుగా ఉంటుంది.ఈ హోటల్ మళ్లీ తెరుచుకుందన్న విషయం తెలియడంతో జనాలు పోటెత్తారు. సాధారణంగా వచ్చే జనం కంటే ఇవాళ రెట్టింపు సంఖ్యలో వచ్చారు. కుమారి ఆంటీ హోటల్ ఏరియా రద్దీగా మారిపోయింది. దాంతో, ఆ హోటల్ వద్ద ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డి త్వరలో కుమారి ఆంటీ హోటల్ ను సందర్శించనున్నట్టు తెలుస్తోంది .



# ఆ రాష్ట్రం నుంచి రాజ్యసభకు షర్మిల?

**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఏపీ రాజకీయాల్లో ప్రస్తుతం సీఎం జగన్ వర్సెస్ షర్మిళ అనే చర్చ నడుస్తున్న విషయం తెలిసిందే. నిన్న మొన్నటి వరకు షర్మిళ తెలంగాణ రాజకీయాల్లో ఉండిపోవడంతో ఏపీలో ఆమె గురించి పెద్దగా చర్చ జరగలేదు. అయితే ఇటీవల కాలంలో తెలంగాణ రాజకీయాలకు తెరదించి.. ఏపీసీసీ అధ్యక్షురాలిగా ఏపీలో లోకి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఇప్పుడు సంచలన కామెంట్లతో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా మారారు.అయితే షర్మిళ భవిష్యత్తు ఏంటి అని ఆలోచిస్తున్నారా.. ప్రస్తుతం ఏపీసీసీ చీఫ్ గా బాగానే రాణిస్తున్నారు. షర్మిళ తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసారని అందరికంటే ముందు చెప్పిందే ఏబీఎన్. అయితే తెలంగాణ ఎన్నికల సమయంలో ఈ విలీన ప్రక్రియ నిలిచిపోయింది.షర్మిళను కాంగ్రెస్ లో చేర్చుకొని ఏపీసీసీ బాధ్యతలు అప్పగిస్తారని చెప్పుకుంటూ వచ్చారు. ఒకవేళ ఆమె బాధ్యతలు స్వీకరించినట్లయితే ఆమెకు భరోసాగా కర్ణాటక నుంచి రాజ్య సభకు పంపిస్తారు అని ఏబీఎన్ ఆర్కే విశ్లేషించారు. ప్రస్తుతం రాజ్యసభకు సంబంధించిన నోటిఫికేషన్ వచ్చేసింది. సార్వత్రిక ఎన్నికల ముందే పెద్దల సభలో ఖాళీల భర్తీకి కేంద్రం సమాయత్తం అవుతుంది. 15 రాష్ట్రాల నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న 56 మంది సభ్యుల పదవీ కాలం ఏప్రిల్ 2,3 తేదీల్లో ముగుస్తుంది.ఆయా స్థానాల భర్తీకి ఫిబ్రవరి 8 నుంచి నామినేషన్లను స్వీకరిస్తారు. 27న పోలింగ్ ఉంటుంది. ఆ రోజు సాయంత్రమే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. అయితే తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న మూడు స్థానాల్లో రెండు కాంగ్రెస్, ఒకటి భారాస గెలుచుకునే అవకాశం ఉంది. అదే సందర్భంలో కర్ణాటకలో మెజార్టీ ఎక్కువగా ఉంది కాబట్టి ఎక్కువ ఎంపీ సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది. వీళ్లు రాసిన దాని ప్రకారం షర్మిళ కు రాజ్యసభ ఇస్తారా లేదా అనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది. ఒకవేళ ఇస్తే ఆరేళ్ల పాటు ఆమెకు తిరుగు ఉండదు. ఏపీ రాజకీయాలపై పూర్తి స్థాయిలో దృష్టిపెట్టే అవకాశం ఉంటుంది.

